క్లుప్తంగా

సంతోషిమాత ఆలయంలో కలశ పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

గోపాలపట్నం: కోటనరవలోని సంతోషిమాత ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కలశ పూజలు చేశారు. కోటనరవ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



గొల్లకంచరపాలెం ఆలయంలో ధనలక్ష్మీదేవికి కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కంచరపాలెం: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కంచరపాలెం, తుమ్మడపాలెం, ఆశవానిపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి ఆలయంలో ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమ పూజలు, మంగళగౌరీ వ్రతాలు నిర్వహించారు. గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వృద్ధులను ఆదరించడం బాధ్యత



వృద్ధులకు వస్త్రాలు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: వృద్ధులను ఆదరించటం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జన్మదిన వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టాభి గార్డెన్‌లోని వానప్రస్థ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ ఉంటున్న వృద్ధులకు చీరలు అందజేసి, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో కలసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చంటిపిల్లల మాదిరిగా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు జియ్యాని విజయ్, జియ్యాని మారుతి, వెదుళ్ల శ్రీనివాసరావు, కంచిపాటి వెంకటరమణ, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం అభినందనీయం

ఉక్కునగరం: చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్టీల్‌ప్లాంట్ థ్రిఫ్ట్ సొసైటీ అవార్డులు ఇవ్వడం ద్వారా ప్రోత్సహించడం అభినందనీయమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి అన్నారు. థ్రిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెరిట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు అవార్డులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లల తల్లులు తీసుకుంటున్న శ్రద్ధ, బాధ్యతల వల్లనే పిల్లలు ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. ఏటా అవార్డులు ఇవ్వడం మంచి సంప్రదాయమన్నారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమంగా రాణించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు కె. ఆనందకుమార్ తన ప్రసంగంలో సొసైటీ సాధిస్తున్న ప్రగతిని వివరించారు.

నిరాశ్రయులకు చల్లని నీడ

కంచరపాలేనికి చెందిన అప్పారావుకు వృద్ధాప్యంలో కుటుంబ సభ్యుల ఆదరణ కరువైంది. దీంతో నగరంలో రహదారులపై తిరుగుతూ ఉండడంతో, కంచరపాలెం పోలీసులు గుర్తించి మమత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలైన ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. ఆమె అతడిని వసతి గృహానికి తీసుకొచ్చి, సిబ్బంది సపర్యలు చేశారు. అతడి గురించి పూర్తి వివరాలు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పారావును అతడి అల్లుడి వద్దకు చేర్చారు. దిక్కుతోచని స్థితిలో రోడ్డున పడ్డవేళ వసతి గృహమే తనను ఆదుకుని అన్నం పెట్టిందని అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.



అప్పారావును బంధువులకు అప్పగిస్తున్న మేనేజర్ మమత

నగరంలోని గొల్లలపాలేనికి చెందిన ఆర్.శివ కేజీహెచ్‌లోని సేవా వార్డులో చికిత్స కోసం చేరాడు. అతడిని ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులెవరూ రాకపోవడంతో, ఈ విషయాన్ని అక్కడి సిబ్బంది మమత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు ఎల్లేటి మమతకు సమాచారం ఇవ్వగా, అతడిని బుచ్చిరాజుపాలెం వసతి గృహానికి తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. కుటుంబం వదిలేసినా, వసతి గృహం అక్కున చేర్చుకుందని శివ తెలిపాడు.



వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న శివ

అందరూ ఉన్నా, ఆఖరి దశలో ఆదరించే వారు లేక కొందరు.. విధివంచనతో అభాగ్యులుగా మారిన ఇంకొందరు.. ఇంటి నుంచి తప్పిపోయి వచ్చి దిక్కుతోచని స్థితిలో ఉన్నవారు మరికొందరు.. ఇలాంటి వారెందరికో మేమున్నామంటూ అక్కున చేర్చుకుని ఆసరాగా నిలుస్తోంది 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో నిరాశ్రయుల వసతి గృహం.

– విశాఖ విద్య



సహపంక్తి భోజనం

జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వసతిగృహం తొలుత బస్తీకి వచ్చి సాయంత్రానికి తిరిగి తమ స్వగ్రామాలకు వెళ్లలేని వారికి రాత్రి బస కోసం ఏర్పాటు చేసినది. కాలక్రమంలో ఈ కేంద్రం, ఏ దిక్కూలేని వారికి కొండంత అండగా నిలుస్తోంది. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వారికి సౌకర్యాలు కల్పించేలా జీవీఎంసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వీరికి నీడనివ్వడంతో పాటు రుచికరమైన ఆహారం అందించి, అన్ని విధాలా ఆదుకుంటున్నారు.

30 మందికి వసతి

30 మందికి ఆశ్రయం కల్పించేందుకు ఏర్పాటు చేసిన బుచ్చిరాజుపాలెం వసతి గృహంలో ఎప్పుడూ అంతకుమించే ఆశ్రయం పొందుతున్నారు. కేంద్రం నిర్వహణను 'విసా స్వచ్ఛంద సంస్థ'కు అప్పగించారు. ఒక మేనేజర్ పర్యవేక్షణలో ముగ్గురు కేర్‌టేకర్లు ఇక్కడ పనిచేస్తున్నారు. వీరికి జీవీఎంసీ ద్వారానే వేతనాలు చెల్లిస్తున్నారు. వసతి గృహంలో ఉంటున్న వారి ఆరోగ్య సంరక్షణకు కేంద్రం నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఎవరికైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే, వెంటనే సమీపంలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి, వారు కోలుకునేలా సేవలు అందిస్తున్నారు.



వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులు

- బుచ్చిరాజుపాలెం వసతి గృహంలో చక్కని సదుపాయాలు
- అభాగ్యులకు ఆదరణ, భరోసా
- జీవీఎంసీ అధికారుల ప్రత్యేక శ్రద్ధ

మనసున్న మారాజులెందరో..

యుక్త వయసు గలవారితో పాటు, వృద్ధులు సైతం ఇక్కడ ఉంటున్నారు. వీరికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేందుకు ఎంతోమంది మనసున్న మారాజులు ముందుకొస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న వేళలో భోజనం పెట్టేందుకు పలువురు దాతలు ముందుకొస్తున్నారు. వసతి గృహం మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎల్లేటి మమత తనకు ఉన్న పరిచయాలతో కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి పుట్టిన రోజు వేడుకలు సైతం జరిపించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.



వసతిగృహంలో పుట్టిన రోజు వేడుక

కుటుంబాల చెంతకు చేరేలా..

నగరంలో ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో తప్పిపోయిన వారికి బుచ్చిరాజుపాలెం కేంద్రం ఆశ్రయం కల్పిస్తోంది. ఇలా వచ్చిన వారికి తగిన వైద్య సేవలు అందించి, కొంత కాలం ఇక్కడే అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. అనంతరం వారి గురించి ఆరా తీసి, కుటుంబాల చెంతకు చేర్చేందుకు వసతి గృహం నిర్వాహకులు ఎంతగానో కృషి చేస్తున్నారు.

వారంతా మా సొంతవారే..



వసతి గృహానికి తీసుకొచ్చే వారందరినీ మా సొంతవారిలా చూసుకుంటూ, వారికి సపర్యలు చేస్తున్నాం. మేనేజర్‌గా ఇటీవలే ఇక్కడ చేరాను. మమత చారిటబుల్ ట్రస్టు ద్వారా చాలాకాలం సేవా కార్యక్రమాలు చేస్తున్నందున, ఇక్కడ మరింత ఇష్టంతో పని చేస్తున్నాను.

– ఎల్లేటి మమత, మేనేజర్, బుచ్చిరాజుపాలెం

నాలుగేళ్లలో ఎంతో మార్పు



ఆదరణ లేక వృద్ధులు, అనాథలెవ్వరూ రహదారులపై ఉండకూడదనే ఉద్దేశంతో రాత్రి బస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇక్కడ ఐదుగురికి మాత్రమే భోజనాలు పెట్టాలి. నాలుగేళ్ల క్రితం వరకు ఇలానే జరిగేది. కానీ జీవీఎంసీ కమిషనర్, పాలక మండలి పెద్ద మనసుతో ప్రత్యేక నిధులు కేటాయించటం వల్లనే ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వారందరికీ రాత్రి వేళల్లో భోజనం అందిస్తున్నాం. దాతల సహకారంతో పాటు వసతి గృహం నిర్వహణకు జీవీఎంసీ సంపూర్ణ సహకారం అందిస్తోంది.

– పి.సుకుమార్ రావు, విసా సెక్రటరీ

నూతన పింఛన్ల పంపిణీ



అర్హులకు కొత్త పింఛన్లు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 40, 58, 59, 60, 61, 62, 63వ వార్డుల పరిధిలో లబ్ధిదారులకు గోకుల యాదవ సామాజిక భవనం వద్ద కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన కొంత మందికి నేడు కొత్తగా పింఛన్లు అందించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, గులిగిందల లావణ్య, పుర్రె పూర్ణశ్రీయాదవ్, కొణతాల సుధ, బల్లా లక్ష్మణరావులతో పాటు నాయకులు, ఆయా వార్డుల పార్టీ అధ్యక్షులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: నియోజకవర్గంలో అన్ని వార్డులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 59వ వార్డు వాయుపుత్ర కాలనీ నుంచి హనుమాన్‌నగర్ వరకు సుమారు 30 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో ఇప్పటి వరకు సుమారు 3 కోట్ల రూపాయలకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలో మరిన్ని పనులు చేపడతామని చెప్పారు. స్థానికంగా ఏదైనా సమస్య ఉంటే వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్‌కు తెలియజేయాలన్నారు. ఆమె అందుబాటులో లేకుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రేవళ్ల సత్యనారాయణ, ఎం.పెంటరావు, భూపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షిక వేడుకలు





పూజలందుకుంటున్న విజయదుర్గ అమ్మవారు, కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

> విజయదుర్గ అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయ 15వ వార్షికోత్సవాన్ని శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారి చిత్రపటాలకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. దుర్గాదేవి కీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం మందిరం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

సంక్షేమానికి పెద్దపీట

సింధియా: రాష్ట్ర ప్రజల సంక్షేమానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని పశ్చిమ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ కొండవాలు ప్రాంతాల్లో సుమారు రూ.18 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరిట జరిగిన నిధుల దుర్వినియోగాన్ని సీఎం వైఎస్ జగన్ అరికట్టి ప్రజలకు మెరుగైన సదుపాయలు కల్పిస్తున్నారన్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆనంద్‌కుమార్

నూతన పింఛన్ల పంపిణీ

అనంతరం 40వ వార్డుకు సంబంధించి 23 మందికి, 63వ వార్డుకు సంబంధించి 36 మందికి కొత్తగా మంజూరైన వైఎస్సార్ ఆసరా పెన్షన్లను లబ్ధిదారులకు ఆనంద్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా, నాయకులు పాల్గొన్నారు.

62వ వార్డులో కార్పొరేటర్ విస్తృత పర్యటన

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు గాంధీజీవీధిలో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వార్డును అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. పలు అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వార్డులో అధికశాతం కొండవాలు ప్రాంతాలే కావడం వల్ల టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, దీంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో ఆలస్యమవుతుందన్నారు. విషయాన్ని పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలోనే పబ్లిక్‌వర్క్స్ విభాగ అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులను ప్రారంభమయ్యేలా చూస్తామన్నారని చెప్పారు. అనంతరం వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.



గాంధీజీ వీధిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

జాబ్ మేళాలో 74 మందికి ఉద్యోగాలు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్ మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. ఐఐఎఫ్‌ఎల్ సంస్థ ఫైనాన్స్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఆధాస్ సొల్యూషన్స్, ఎంఏఎస్ మెరైన్ సర్వీసెస్, ట్రీని టెక్ ఇన్ఫ్రా ఇండియా, టీం లీజ్, బయో ఫోర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మేధా సర్వో డ్రైవ్, రిలయన్స్ డిజిటల్ పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 690 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 287 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 74 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి అనంతరం జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

అర్హత ఉంటే చాలు..

- ఏ కమిటీల సిఫార్సులు అవసరం లేదు
- 'పచ్చ' జలగల బెడదా లేదు
- ఇంటికే వచ్చి పింఛన్ అందజేత
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి
- లబ్ధిదారులకు కొత్త పింఛన్ల పంపిణీ

గోపాలపట్నం: పింఛన్ల మంజూరుకు అవసరమైన అర్హత ఉంటే నేరుగా ఇంటికే పింఛన్ అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 92వ వార్డు కుమారి కల్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలనే కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అందుకే ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా అందరికీ ఇంటికే వచ్చి పింఛన్ అందించే ఏర్పాట్లు చేశారన్నారు.

పచ్చ జలగలను దూరం పెట్టాలి

గత తెలుగుదేశం ప్రభుత్వంలో కొత్తవారికి పింఛన్ రావాలంటే లబ్ధిదారుల్లో ఎవరో ఒకరు మరణిస్తేనే వచ్చేవని తెలిపారు. అవకాశం ఉన్న చోట పచ్చ చొక్కాల ఏజెంట్లు జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకోవలసిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు మీకు అర్హత ఉంటే మీ ఇంటికే పింఛను వస్తుందని తెలిపారు. మధ్యలో పచ్చ జలగలు లేవన్నారు. ప్రజల రక్తం పీల్చే ఆ జలగలను ఎంత దూరం పెడితే అంత మంచిదన్నారు. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు.



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఆనంద్ కుమార్

100 కొత్త పింఛన్లు పంపిణీ

జీవీఎంసీ 89, 91, 92 వార్డుల పరిధిలోని 100మందికి వేదికపై కొత్త పింఛన్లు అందించారు. దరఖాస్తులు ఇంకా వెరిఫికేషన్ చేస్తున్నామని, పింఛన్లు ఇంకా పెరిగే అవకాశం ఉందని ఏపీడీ శ్రీరామ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, సీపీఐ నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, వైఎస్సార్ జేసీఎస్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

90వ వార్డులో 49మందికి..

జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో నూతన పింఛన్లు పంపిణీ చేశారు. వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి, సీనియర్ నాయకుడు నమ్మి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆడారి ఆనంద్ కుమార్ పాల్గొని పింఛన్లు అందించారు. వార్డులో 49 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, గేదెల మురళీకృష్ణ, యల్లపు వెంకటేశ్వరరావు, శంషద్ బేగం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు, వలంటీర్లు, కార్యకర్తలు

'ఉక్కు' ఊపిరిని ఆపలేరు

కూర్మన్నపాలెం: పోరాటాలు, బలిదానాల ద్వారా ఏర్పాటు చేసుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ జోలికి వస్తే అథోగతి పాలుకాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 932వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఆగస్టులో విశాఖ స్టీల్‌ప్లాంట్ మెరుగైన అమ్మకాలు సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు సృష్టించినా.. విశాఖ ఉక్కు కర్మాగారం ఊపిరి ఆపివేయాలని చూసినా కార్మికులు మొక్కవోని దీక్షతో ప్లాంట్‌ను లాభాల దిశగా నడిపించేందుకు చేస్తున్న కృషికి జోహార్లు తెలుపుతున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

> విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ 92వ వార్డు 21086477 సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబం ఏవిధమైన సాయం పొందిందో వివరించారు. అర్హత ఉండి పథకాలు అందక పోతే తన దృష్టికి తీసుకు రావాలని ఆనంద్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సమస్యలు తన సమస్యలుగా భావించి పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఆయన్ను మళ్లీ మనం ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజలు ఏవిధంగా ఉన్నారో పట్టించుకునే పరిస్థితిలో లేరని విమర్శించారు. కరోనా కష్ట కాలంలో కూడా ప్రజలకు సాయం చేయలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, ఊటపల్లి గోవింద్, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఆర్పీలు పాల్గొన్నారు.



ఇందిరానగర్‌లో మహిళకు ప్రభుత్వ పథకాలు బ్రోచర్ అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలి

మల్కాపురం: సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలంతా తప్పనిసరిగా వారంలో ఒకరోజు డ్రై డే పాటించాలని జోన్–5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ కోరారు. 61వ వార్డు మల్కాపురం, హరిజనవీధి వద్ద కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. కార్పొరేటర్ సుధ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ తదితర విషజ్వరాలు వ్యాపిస్తాయన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో జోన్–5 ప్రజా ఆరోగ్య శాఖ సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ బయాలజిస్ట్ డి.ఎస్.మూర్తి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వ్యాధుల నివారణకు సూచనలు తెలియజేస్తున్న జోన్–5 జెడ్సీ కృష్ణ, కార్పొరేటర్ సుధ